సాక్షి వికారాబాద్

శుక్రవారం । 5 । జనవరి । 2024



జోరుగా కలప దందా

దోమ మండల వ్యాప్తంగా కలప అక్రమ దందా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. 8లో▸



రూపురేఖలు మారుస్తాం

సీఎం సహకారంతో తాండూరు రూపురేఖలు మారుస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



అభయ హస్తానికి ఆదరణ

ధారూరు మండలంలో కొనసాగుతున్న ప్రజాపాలన గ్రామ సభలకు దరఖాస్తులు భారీగా వస్తున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

ఏకేఆర్ డైరీని ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి



డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొంగులేటి సుధాకర్‌రెడ్డి

వికారాబాద్ అర్బన్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి త్వరలో నోటిఫికేషన్లు వస్తాయని, అందుకు తగ్గట్టుగా గ్రామీణ ప్రాంత నిరుద్యోగులను సిద్ధంగా చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి సుధాకర్ రెడ్డి సూచించారు. వికారాబాద్‌కు చెందిన ఏకేఆర్ స్టడీ సర్కిల్‌ను డైరీని, డీఎస్సీ కోచింగ్ వాల్ పోస్టర్‌ను డైరెక్టర్ వి.బి. రమణతో కలిసి నగరంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు ఉద్యోగాల సాధనకు సిద్ధం కావాలని సూచించారు. అనంతరం ఏకేఆర్ డైరెక్టర్ రమణ మాట్లాడుతూ.. త్వరలో ప్రభుత్వం నిర్వహించే మెగా డీఎస్సీకి అభ్యర్థులను సిద్ధం చేసేందుకు ఈ నెల 22, 23, 24 తేదీల్లో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత నిరుద్యోగులు అవగాహన సదస్సుకు హాజరు కావాలని ఆయన కోరారు.

'తొలిమెట్టు' అమలు భేష్

జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి

ధారూరు: ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందేలా ఉపాధ్యాయులు చేస్తున్న బోధనపై జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా.. వారిలో నైపుణ్యం పెంచేలా బోధన చేయడాన్ని ఆమె అభినందించారు. ధారూరు మండలం కాచారం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివాణికి జెడ్పీ చైర్‌పర్సన్ గురువారం వీడియో కాల్ చేసి మాట్లాడారు. పాఠశాలలో తొలిమెట్టు కార్యక్రమం చక్కగా అమలు చేస్తున్నారని కొనియాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెరుగైన బోధనకు కాచారం పాఠశాలే నిదర్శనమన్నారు. టీఎల్‌ఎం పద్ధతి బోధన తమకు అర్థం అవుతున్నట్లు విద్యార్థులు జెడ్పీ చైర్‌పర్సన్‌కు వివరించారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు కూడా ఇంగ్లిష్‌లో మాట్లాడడంపై సునీతారెడ్డి మంత్రముగ్ధులయ్యారు.

దివ్యాంగులు ఆర్థిక పురోగతి సాధించాలి



మాట్లాడుతున్న అడిషనల్ పీడీ నరసింహులు

అనంతగిరి: దివ్యాంగులు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ నరసింహులు సూచించారు. గురువారం వికారాబాద్‌లోని ఐకేపీ కార్యాలయంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్, సిడ్బి సంస్థల ఆధ్వర్యంలో దివ్యాంగులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని చిరు వ్యాపారాలు చేసుకుంటున్న నిరుపేద దివ్యాంగులను గుర్తించి వారి వ్యాపారానికి ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన 43 మంది దివ్యాంగులకు రూ. 25వేల ఆర్థిక సహాయం ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సిడ్బి ప్రతినిధి దక్షిణామూర్తి, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీలక్ష్మి, శ్రీనివాస్, ఉదయ్, జిల్లా కోఆర్డినేటర్ రామేశ్వర్, కమ్యూనిటీ లీడర్లు సంజీవరావు, రాములు, శ్రీశైలం, యాదయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్: 2024–25 విద్యా సంవత్సరానికి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మొయినాబాద్‌లోని శంకర్‌పల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయమ్మ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు గురుకులంలో ప్రవేశానికి వెంటనే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఫిబ్రవరి 11న ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

మహేశ్వరం డీసీపీగా..

మహేశ్వరం: మహేశ్వరం డీసీపీగా సునీతారెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన సీహెచ్ శ్రీనివాస్‌ను రాజేంద్రనగర్ డీసీపీగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో రాచకొండ కమిషనరేట్‌లో నార్కొటిక్స్ బ్యూరోగా విధులు నిర్వర్తిస్తున్న సునీతారెడ్డి బదిలీపై వచ్చారు.



వికారాబాద్ సమీపంలోని అనంతగిరి కొండలు

అనంతగిరులు.. పర్యాటక సిరులు

టూరిజం అభివృద్ధిపై మళ్లీ కదలిక

- పర్యాటక శోభ సంతరించుకోనున్న అనంతగిరి గుట్ట
- ఎల్‌అండ్‌టీ సంస్థకు పనుల అప్పగింత
- కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష
- పెరగనున్న ఉపాధి అవకాశాలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: జిల్లా కేంద్రానికి అనుకొని ఉన్న అనంతగిరి కొండలను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసే విషయంలో మళ్లీ కదలిక వచ్చింది. గురువారం ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ నారాయణరెడ్డి అప్పగించిన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే మాస్టర్ ప్లాన్‌పై వారితో చర్చించి, పలు సూచనలు చేశారు. పనులు పూర్తయితే అనంతగిరి కొండలు, అటవీ ప్రాంతంలోని సర్పన్‌పల్లి ప్రాజెక్టు, కోట్‌పల్లి ప్రాజెక్టులకు పర్యాటక శోభను సంతరించుకోనున్నాయి.

స్వదేశీ దర్శన్ పథకం కింద ఎంపిక

స్వదేశీ దర్శన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ పథకం రెండో విడతలో అనంతగిరి తోపాటు యాదాద్రి జిల్లా భువనగిరి కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం అధికారులు సమాయత్తమయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో టూరిజం అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశమైన అధికారుల బృందం మాస్టర్ ప్లాన్, ప్రాజెక్టు తయారీ బాధ్యతలు ఎల్‌ఎన్‌టీ సంస్థకు అప్పగించారు. మాస్టర్ ప్లాన్ పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేసిన నేపథ్యంలో తాజాగా గురువారం కలెక్టర్ వారితో సమావేశమై అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వికారాబాద్ పట్టణానికి పర్యాటక శోభ సంతరించుకోవడం ఖాయం. అంతేకాకుండా ఈ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

అడ్వెంచర్ టూరిజం స్పాట్‌గా..

సాధారణంగా పర్యాటక కేంద్రాలు రెండు రకాలుగా అభివృద్ధి చేస్తారు.ఇందులో ఒకటి సాధారణ పర్యాటక కేంద్రంగా..ఇందులో అడవుల అందాలు వీక్షించడం,దేవాలయాల సందర్శన తదితర అంశాల ఉంటాయి. రెండోది అడ్వెంచర్ టూరిజం (సాహస పర్యాటకం). ఇందులో ప్రధానంగా యువత ఇష్టపడే సాహస కృత్యాలు ఉండేలా అభివృద్ధి చేస్తారు. ట్రెక్కింగ్, రోప్ వే వంటివి ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం వికారాబాద్ సమీపంలో ఉన్న అనంతగిరులు ఈ రెండింటికీ అనుకూలం. ఆ తరహాలో టూరిజం అభివృద్ధి చేసేలా ప్లాన్ చేస్తున్నారు. ఇందుకోసం రూ.70 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమిక అంచనా వేశారు. అవసరాన్ని బట్టి అంచనాల వ్యయం పెరిగే అవకాశం కూడా ఉందని అధికారులు తెలిపారు.రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న ఈ ప్రదేశం ఇప్పటికే పర్యాటక కేంద్రంగా పేరు తెచ్చుకుంది. ప్రస్తుతం స్వదేశీ దర్శన్ పథకంలో భాగంగా చేపట్టనున్న పనులు మరింత ఆకర్షణగా నిలిచే అవకాశం లేకపోలేదు. ఎకో పార్కు, కన్వెన్షన్ హాళ్లు, ట్రెక్కింగ్, రోప్ వేస్, హోటల్స్, ఆలయ అభివృద్ధి, వ్యూ పాయింట్ డెవలప్‌మెంట్, పార్కుల అభివృద్ధి, ఈటింగ్ హాల్స్, పక్షులు, జంతువుల వీక్షణ తదితర వాటి అభివృద్ధికి 213 ఎకరాలు కేటాయించనున్నట్లు తెలిసింది. రోజుకు 5 వేల మంది పర్యాటకులు ఇక్కడికి వచ్చి వెళుతున్న నేపథ్యంలో రాత్రి వెయ్యి మంది ఇక్కడే బస చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 5వందల నుంచి వెయ్యి మంది వరకు ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి లభించనుంది.

అనేక అనుకూలతలు

వికారాబాద్‌కు అత్యంత సమీపంలో ఉన్న అనంతగిరి గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అనేక అనుకూల అంశాలు ఉన్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు 70 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే గంట వ్యవధిలో నగర వాసులు ఈ ప్రాంతానికి చేరుకునే అవకాశం ఉంది. బెంగళూరు, ముంబై హైవేల నుంచి కూడా గంటలోపు ఇక్కడికి చేరుకోవచ్చు. దట్టమైన అటవీ ప్రాంతం. ఎత్తయిన కొండలు, రోడ్డులో అందమైన మలుపులు, గుట్టపై చారిత్రాత్మకమైన అనంత పద్మనాభస్వామి ఆలయం, ట్రెక్కింగ్ స్పాట్‌లు, అనేక రకాల పక్షిజాతులు, జంతు జాతులు అనంతగిరి అడవిలో ఉన్నాయి. తెలంగాణ టూరిజం శాఖ నిర్మించిన కాటేజీలు, పక్కనే బుగ్గ రామేశ్వర దేవాలయం, కోట్‌పల్లి ప్రాజెక్టు, సర్పన్‌పల్లి ప్రాజెక్టు, వీటిలో బోటింగ్ ఇలా అనేక రకాలుగా అనంతగిరిని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అనుకూల అంశాలు. నిత్యం వేల సంఖ్యలో, వీకెండ్స్‌లో మరింత ఎక్కువ మంది పర్యాటకులు అనంతగిరులకు వస్తుంటారు. ఈ ప్రాంతం స్వదేశీ దర్శన్ పథకం కింద ఎంపికైన నేపథ్యంలో టూరిజం హబ్‌గా మారనుంది.

> **పనుల్లో వేగం పెంచండి**
>
> ఎకో టూరిజం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధులను ఆదేశించాం. అనంతగిరితో పాటు పక్కనే ఉన్న సర్పన్‌పల్లి ప్రాజెక్టును (213 ఎకరాల్లో) అభివృద్ధి చేస్తాం. అనంతగిరి స్వదేశీ దర్శన్ కింద ఎంపిక కావడం వరం. దీంతో జిల్లాకు గుర్తింపు రావడమే కాకుండా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఫారెస్టు, టూరిజం శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను సకాలంలో పూర్తి చేయాలి.
>
> – నారాయణరెడ్డి, కలెక్టర్

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం



మర్పల్లి ప్రజాపాలనలో మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్

- ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని వికారాబాద్ ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల కోసం ప్రజల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల హామీలను కచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు. గతంలో కూడా తమ హయాంలోనే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, భూ పంపిణీ చేశామని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేశారని పేర్కొన్నారు. త్వరలో మరో నాలుగు పథకాలను అమలు చేస్తామని తెలిపారు. తాము అధికారంలో ఉన్నప్పుడే వికారాబాద్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, బీఆర్‌ఎస్ పాలనలో ఒరిగిందేమీ లేదని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలు అమలయ్యేలా చూస్తామని తెలిపారు. జిల్లాలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ఇప్పటికే రూ. 300 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. అదనంగా మరో రూ. 150 కోట్లు విడుదల చేయిస్తామని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ఆర్థిక సాయాన్ని పెంచనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఈ పథకాల కింద రూ. లక్ష 116 వచ్చేదని, ఈ మొత్తాన్ని రూ.1 లక్ష 60 వేలకు పెంచనున్నట్లు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆర్డీఓ విజయకుమారి, మండల ప్రత్యేక అధికారి అనిత, తహసీల్దార్ గణేశ్, ఏపీఎం మధుకర్, ఏఓ వసంత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, బ్లాక్ -2 అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు రాములు యాదవ్, సర్పంచ్ మైమూదాబీ, జిల్లా నాయకులు ఖలీమొద్దీన్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ ఎస్ కొండల్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఫసి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్తేమా ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

- మతాలకతీతంగా పండుగ జరుపుకోవాలి
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

పరిగి: మతాలకు అతీతంగా ఇస్తేమాను జరుపుకోవాలని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి సూచించారు. ఈ నెల 6నుంచి 8వ తేదీ వరకు జరిగే ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించిన పనులను గురువారం పరిశీలించారు. ప్రార్థన చేసేందుకు వచ్చే ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇస్తేమాకు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది ముస్లింలు వస్తారని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇక్కడి వచ్చే వారికి పార్కింగ్ సదుపాయం, గదుల సౌకర్యం కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, ఎంపీపీ అరవింద్‌రావు, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మీర్ మహ్మద్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సురేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించండి

మొయినాబాద్: తహసీల్దార్ కార్యాలయాల్లో భూముల రిజిస్ట్రేషన్ చేసే ధరణి కంప్యూటర్ ఆపరేటర్లకు తొమ్మిది నెలల పెండింగ్ జీతాలను వెంటనే ఇప్పించాలని ధరణి ఆపరేటర్లు ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌కు విన్నవించారు. వివిధ మండలాల్లో పని చేసే ధరణి ఆపరేటర్లు గురువారం మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో గౌతమ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సెంట్రిక్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా తాము ఆపరేటర్లుగా పనిచేస్తున్నామని.. తమకు 2021 జూలై వరకు రూ.9,878, ఆ తరువాత రూ.11,583 వేతనాలు ఇస్తున్నారన్నారు. అవి కూడా ఏ ఒక్క నెలలో సక్రమంగా చెల్లించలేదన్నారు.

నాపరాతి గనుల్లో తనిఖీలు

- లీజు లేకుండా తవ్వకాలు జరిపితే చర్యలు
- మైన్స్ శాఖ ఏడీ శామ్యూల్ జాకబ్



నాపరాతి గనిలో తనిఖీలకు వెళుతున్న అధికారులు

తాండూరు రూరల్: ప్రభుత్వ, పట్టా భూముల్లో అక్రమంగా నాపరాతి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని మైన్స్ శాఖ ఏడీ శామ్యూల్ జాకబ్ హెచ్చరించారు. గురువారం తాండూరు మండలం సంగెంకలాన్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి.. సర్వే నంబరు 109లో కొనసాగుతున్న అక్రమ గనిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు తనిఖీలు చేశామన్నారు. అక్రమ తవ్వకాలు జరిపినట్లు గుర్తించినట్లు తెలిపారు. కొలతల ఆధారంగా జరిమానా విధిస్తామన్నారు. గనికి కరెంట్ సరఫరా నిలిపివేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. త్వరలో మండలంలోని మల్కాపూర్ గనిలో తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్‌ఐ రమేష్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ కోటిరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటం తోపాటు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, సీఐ వెంకటేశం, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మత్తు.. యువత చిత్తు



కొడంగల్ నియోజకవర్గంలోని శివారు గ్రామంలో సాగు చేసిన గంజాయి (ఫైల్)

- శివారు గ్రామాల్లో గుట్టుగా గంజాయి సాగు
- కొరవడిన నిఘా
- మత్తులో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న యువత
- ఆందోళనలో విద్యార్థినుల తల్లిదండ్రులు

కొడంగల్: నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్‌లో గంజాయి వాసన గుప్పుమంటోంది. పలు ప్రాంతాల్లో గంజాయి దొరుకుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అధికార యంత్రాంగం నిఘా పెడితే మత్తు పదార్థాల ఆచూకీ లభించే అవకాశం ఉందని బాధిత కుటుంబ సభ్యులు అంటున్నారు. పలువురు యువకులు గంజాయి మత్తులో చిత్తవుతున్నట్లు గతంలో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, ఆబ్కారీ శాఖ అధికారులు స్పందించడం లేదనే విమర్శలు కూడా లేకపోలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కు పాదం మోపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యంగా సీఎం నియోజకవర్గంలో గట్టి నిఘా ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే సంబంధిత అధికారులు సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించడం లేదు. గంజాయి మత్తులో ఉన్న యువకులు.. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో కొందరు ఆకతాయిలు అమ్మాయిలను వేధిస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. పోలీసుల నుంచి స్పందన లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొడంగల్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల దగ్గర పోలీసుల గస్తీ ఏర్పాటు చేయాల్సి ఉంది.

పలు ప్రాంతాల్లో గంజాయి లభ్యం

మండల పరిధిలోని పలు గ్రామాలు కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. ఈ గ్రామాలపై పోలీసులు, ఆబ్కారీ అధికారులు, ఇంటలిజెన్స్ నిఘా వర్గాలు దృష్టి పెట్టలేదు. దీంతో సారా, గుడుంబా తయారీ, గంజాయి పెద్ద మొత్తంలో సాగవుతోంది. యువత మత్తుకు బానిస కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. గంజాయి మత్తులో యువత ఘోరాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ మధ్య కాలంలో జరిగిన పలు సంఘటనలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో గంజాయి సాగవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడ పండించిన గంజాయిని హైదరాబాద్ తోపాటు కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గా ఉన్న అకున్ సబర్వాల్ ఈ విషయంపై సీరియస్‌గా ఉండి తగిన చర్యలు తీసుకున్నారు. పలు గ్రామాల్లో గంజాయి సాగు జరుగుతున్నా ఆబ్కారీ అధికారులు తెలుసుకోలేక పోవడం విమర్శలకు తావిస్తోంది. గతంలో సివిల్ పోలీసులు గమనించి మూకుమ్మడి దాడులు చేసి గంజాయి సాగును బహిర్గతం చేశారు. పలు గ్రామాల్లో గంజాయి సాగును ఆదాయ వనరుగా మారింది. మారుమూల గ్రామాల్లో మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో గంజాయి సాగు జరుగుతున్నట్లు వినికిడి. బంతిపూల తోట, కంది, పత్తి, ఇతర పంటల్లో అంతర పంటగా సాగు చేస్తున్నారు. పలు గ్రామాల్లో మూకుమ్మడిగా సాగు చేయడం వల్ల గ్రామస్తులు బయటకు చెప్పడం లేదు.

క్లుప్తంగా

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

యువకుడి మృతి

తాండూరు రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కోత్లాపూర్ శివారులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కథనం ప్రకారం.. కోత్లాపూర్‌నికి చెందిన కుర్వ అనంతమ్మ కొడుకు దస్తప్ప(20) వృత్తిరీత్యా మేకల కాపరి. గురువారం రాత్రి బైక్‌పై మిర్యాణం వెళ్తున్నాడు. మార్గమధ్యలో కోత్లాపూర్ బ్రిడ్జి వద్ద దస్తప్ప బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో దస్తప్ప బ్రిడ్జిపై నుంచి వాగులో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహన్ని తాండూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి వద్ద దస్తప్ప తల్లి అనంతమ్మ, సోదరుడు శ్రీకాంత్ కన్నీటి పర్యంతమయ్యారు.

కష్టపడి చదివితే మంచి ఫలితాలు

- పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రఘునందన్

అబ్దుల్లాపూర్‌మెట్ : పదవ తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ సూచించారు. పెద్ద అంబర్‌పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిడ్ డే మీల్స్ బియ్యాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తనలో ప్రేరణ శక్తి కలిగి ఉండాలని, అదే అద్భుతమైన ఫలితాలను సొంతం చేస్తుందన్నారు. విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదివితే పాఠశాలకు మంచి పేరు రావడమే కాకుండా తల్లి దండ్రులకు, ఉపాధ్యాయులకు గర్వ కారణంగా నిలుస్తారన్నారు. అన్నం వండటానికి కళాయి పూతతో ఉన్న పాత్రలను వాడితే ఆహారం శ్రేష్ఠంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి , ప్రాథమిక పాఠశాల అధ్యాపకురాలు శ్రీలత పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాడ్గుల: మాడ్గుల మండలం కలకొండ వాగు నుంచి గురువారం ఉదయం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. డ్రైవర్ ఫకీరా తండాకు చెందిన నరేందర్‌పై కేసు నమోదు చేయడంతో పాటు ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

రెండిళ్లలో చోరీ

శంకర్‌పల్లి: శంకర్‌ల్లి పీఎస్ పరిధిలోని పర్వేద గ్రామంలో బుధవారం రాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని పర్వేదకి చెందిన శంకరయ్య బుధవారం సాయంత్రం శంకర్‌పల్లిలోని కుమారుల వద్దకు వెళ్లారు. పద్మమ్మ కూడా అదే రోజు వేరే ఊరికి వెళ్లింది. గురువారం ఉదయం తిరిగి ఇంటికి వెళ్లి చూడగా రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బుగ్గ శంకరయ్య ఇంట్లో రూ.40వేల నగదును చోరీకి గురికాగా, పద్మమ్మ ఇంట్లో నగదు, తులం బాంగారం అపహరణకు గురైంది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

లారీ ఢీకొని..

బైకిస్టు దుర్మరణం

పహాడీషరీఫ్: లారీ ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చాంద్రాయణగుట్ట నుంచి షాహీనగర్ వైపు గురువారం సాయంత్రం ఓ గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వెళ్తున్నాడు. ఎర్రకుంట చౌరస్తా వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి జారిపడిపోయాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన ఓ లారీ అతని తలపైనుంచి పోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాహన నంబర్‌ను పరిశీలించగా రామాంతపూర్ వాసిగా చూపిస్తోంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సంబంధీకులెవరైనా ఉంటే బాలాపూర్ పోలీస్ స్టేషన్‌లో గాని 87126 62366 నంబర్ లోగానీ సంప్రదించాలని తెలిపారు.

జోరుగా కలప దందా

రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయాలు ఖర్చు చేసి హరితహారం కార్యక్రమంలో మొక్కలను నాటుతుంటే అవి పెద్దవైన తర్వాత కొందరు అక్రమార్కులు వాటిని నరుకుతూ కలప వ్యాపారం చేస్తున్నారు. తీసుకున్న అనుమతుల కంటే రెండు, మూడింతలు ఎక్కువగా నరుకుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. చెట్లను రక్షించాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో కలప దందా 'మూడు పువ్వులు, ఆరు కాయలు' అన్న చందాగా నడుస్తోంది. మామూళ్లకు అలవాటుపడిన అధికారులు వ్యాపారులతో కుమ్మక్కై కలప దందా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

- అనుమతులకు మించి చెట్ల నరికివేత
- లారీల్లో నగరానికి తరలింపు
- అక్రమార్కులకు అధికారుల అండదండలు!





లారీలో తరలిస్తున్న కలప, (ఇన్‌సెట్‌లో) అనుమతులు లేకుండా నరికివేసిన కలప

దోమ: దోమ మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో కలపదందాను కొందరు అక్రమార్కులు జోరుగా కొనసాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామాల్లోని రైతుల పొలాల్లో చెట్లను నరికి విక్రయించి లక్షల రూపాయాలు దండుకుంటున్నారు. మండల పరిధిలోని ఊటుపల్లి, రాకొండ, బడేంపల్లి, కొండాయపల్లి, పాలేపల్లి, మోత్కుర్, ఐనాపూర్, దాదాపూర్, గంజిపల్లి, బుద్లాపూర్ తదితర గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే కలపను నరికి వేస్తూ లారీల్లో తరలిస్తున్నారు. ఫారెస్టు అధికారుల దగ్గర నుంచి ఒక లారీకి అనుమతులు తీసుకువచ్చి రోజుకు మూడు నుంచి నాలుగు లారీల కలపను నరికి రాత్రి వేళల్లో నగరానికి తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అధికారుల కనుసన్నల్లోనే..!

కలప అక్రమ రవాణాను అరికట్టాల్సిన రెవెన్యూ, పోలీస్, ఫారెస్టు అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. వ్యవసాయ పొలాల్లో చెట్లను నరకాలంటే అనుమతులను తప్పనిసరిగా పొందాలి. కానీ ఇక్కడి కలప వ్యాపారులు అవేవీ పట్టించుకోకుండా అధికారుల అండతో ఇష్టానుసారంగా చెట్లను నరికివేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉండే పోలీసులకు అంతా తెలిసినా మామూళ్లు తీసుకుని కలప వాహనాలను వదిలిపెడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేసి అక్రమ దందాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు పొందాలి

కలప వ్యాపారం చేయాలనుకనే ఎవరైనా అనుమతులు తప్పనిసరిగా పొందాలి. పొందిన అనుమతులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. అనుమతులు తీసుకున్న వాటికంటే అదనంగా లారీల్లో కలప తరలిస్తున్నట్లు తెలిస్తే.. దాని విలువను బట్టి జరిమానాలు విధిస్తాం. కొన్నిసార్లు జరిమానా, జైలు శిక్ష రెండూ పడే అవకాశం ఉంది. కలప అక్రమ రవాణాను అడ్డుకుంటాం. అయినప్పటికీ కలప రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కలప రవాణాపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– హోమిప్రకాశ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, దోమ

నిఘా ఏర్పాటు చేశాం



కలప అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. రాత్రి సమయాల్లో బీట్ నిర్వహించి అనుమతులు లేకుండా కలప తరలిస్తున్న లారీలను పట్టుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. పట్టుకున్న లారీలను ఫారెస్ట్ అధికారులకు అప్పగించేలా చర్యలు తీసుకుంటాం. అక్రమంగా రవాణాపై సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపాలి.

– రవిగౌడ్, ఎస్ఐ, దోమ

లారీలను సీజ్ చేస్తాం



కలప రవాణాకు అనుమతులు తప్పనిసరి. అనుమతులు లేకుండా ఎంతటివారైన సరే అక్రమంగా దందాను చేస్తున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. రైతుల పంట పొలాల్లో చెట్లను నరికి వేయాలంటే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతులు లేకుండా చెట్లను నరికితే కఠిన చర్యలు తీసుకుంటాం. లారీలను సీజ్ చేస్తాం.

– పురుషోత్తం, తహసీల్దార్, దోమ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

దోమ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం దోమ మండల పరిధిలోని మోత్కుర్‌లో గ్రామ సర్పంచ్ కేశవులు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఆరు గ్యారంటీలను తీసుకువచ్చిందన్నారు. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల మంజూరుకు శ్రీకారం చుట్టిందన్నారు. త్వరలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి..

పూడూరు: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవర్చుకోవాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మన్నేగూడ జేకే ఫంక్షన్‌హాల్‌లో డీసీసీ కార్యదర్శి పెంటయ్య ఏర్పాటు చేసిన మేముసైతం మోటివేషన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. యువత తల్లిదండ్రులకు, గురువులకు గౌరవం ఇవ్వాలని వారు చెప్పే మాటలను విని ఆచరణలో పెట్టాలని తెలిపారు. ఉపాధ్యాయులు.. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని కోరారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాండూరు రూపురేఖలు మారుస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

పెద్దేముల్: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో తాండూరు రూపురేఖలు మారుస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దేముల్ మండల ఇందూరు, పెద్దేముల్, తట్టెపల్లి, అడ్కిచెర్ల గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ ముఖ్య లక్ష్యమన్నారు. ప్రతి ఆర్జీకి తప్పకుండా రసీదులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. పథకాల అమలులో దళారులను నమ్మరాదని తెలియచేశారు. లబ్ధిదారులు తెల్లపేపర్‌పై అర్జీలు ఇచ్చినా తప్పకుండా పరిగణలోకి తీసుకుంటామన్నారు. కొత్త రేషన్‌కార్డులపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్, మాజీ జెడ్పీటీసీ అంజయ్య, వైస్ ఎంపీపీ మధులత, సర్పంచ్‌లు ద్యావరి విజయమ్మ, పద్మ, తహసీల్దార్ కిషన్, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఏఓ నజీరుద్దీన్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజిరెడ్డి, ఎస్ఐ కాశీనాథ్, పీహెచ్‌సీ డాక్టర్ బుచ్చిబాబు, విద్యుత్ ఏడీ, ఏఈ సందీప్‌కుమార్, మండల మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు మైపాల్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, మినాజ్, మెగులప్ప, మండల మహిళా అధ్యక్షురాలు శోభరాణి, మండల కోఆప్షన్ సభ్యుడు నసీర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి ధర తగ్గింపుపై భగ్గుమన్న రైతన్న

రోడ్డుపై బైఠాయించి ఆందోళన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

పరిగి: రాత్రికిరాత్రి పత్తి ధరలు తగ్గించి మా పొట్టగొడుతున్నారని రైతులు పత్తి ట్రాక్టర్లతో రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. వివరాలు.. మండల పరిధిలోని రంగంపల్లి, పూడూర్ మండలంలోని రాకంచర్ల, సోమన్‌గుర్తి, చిట్టంపల్లి గేటు సమీపంలోని పత్తిమిల్లుల ఎదుట రైతులు గురువారం జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఒక్క రోజులోనే క్వింటాల్‌కు రూ.100 వరకు తగ్గించడం ఏంటని ప్రశ్నించారు. నిన్నటివరకు పత్తి క్వింటాల్‌కు రూ.7,020 ఉండగా ఉదయం చూసే సరికి రూ.6920 చేయడం ఏంటని ప్రశ్నించారు. మిల్లుల యాజమాన్యం, ప్రభుత్వం కలసి రైతులను మోసం చేస్తున్నాయన్నారు. అధికారులు రైతుల వద్దుకు వచ్చి సీసీఐ నుంచే క్వింటాల్‌కు వంద రూపాయలు తగ్గిందని చెప్పడంతో రైతులు చేసేది లేక ధర్నాను విరమించారు.

పరిహారం ఇచ్చాకే పనులు చేసుకోండి

ఇండస్ట్రియల్ పార్కు పనులను అడ్డుకున్న రైతులు



పనులను అడ్డుకుంటున్న రైతులు ఎల్లప్ప, బాలప్ప

తాండూరు రూరల్: మండలంలో ఏర్పాటు చేస్తున్న ఇండస్ట్రియల్ పార్క్ పనులను గురువారం జినుగుర్తి గ్రామ రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు బాలప్ప, ఎల్లప్ప మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్ పార్క్ కోసం కేటాయించిన భూమిలో తమకు చెందిన 7 ఎకరాల 36 గుంటల భూమి ఉందని తెలిపారు. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదన్నారు. పరిహారం చెల్లించాకే పనులు చేసుకోవాలని కోరారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ విషయమై తహసీల్దార్ తారాసింగ్ మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్ పార్క్ పనులను అడ్డుకోరాదని, పరిహారం రాకపోతే ఆ వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయంచేస్తామని హామీ ఇచ్చారు.

అసైన్డ్ భూములపై విచారణ జరిపిస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: సిద్దాపూర్ గ్రామ శివారులో ఉన్న అసైన్డ్ భూములను గత ప్రభుత్వం పేదల నుంచి ఎందుకు బలవంతంగా సేకరించిందో విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మెల్యే శంకర్ రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండలం సిద్దాపూర్ శివారులో ఉన్న 334 ఎకరాల అసైన్డ్ భూముల గురించి చర్చించారు. ఈ భూములను గత ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా సేకరించిందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఒకసారి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నామని, మరోసారి ఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని భూములు సేకరించినట్లు గత ప్రభుత్వ పాలకులు చెప్పారని పేర్కొన్నారు. అసలు రైతుల నుంచి అసైన్డ్ భూములు ఎందుకు తీసుకున్నారు, ఎవరి కోసం భూములు సేకరించారు. అన్న విషయాలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపడితే కీలకమైన అంశాలు వెలుగు చూసే అవకాశాలు ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

అభయహస్తంకు దరఖాస్తు చేసుకోండి



దౌల్తాబాద్: దరఖాస్తులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



ధారూరు: దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, రాహుల్ శర్మ

దౌల్తాబాద్: ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం ఆరుగ్యారంటీల కోసం అర్హులైన ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ కోరారు. మండలంలోని చల్లాపూర్, సురాయిపల్లి గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అధికారులకు పలుసూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామసభల ద్వారా దరఖాస్తు చేసుకోలేని వారు ఆందోళన చెందకుండా ఈనెల 6వరకు పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉండేవారు రేషన్‌కార్డులో పేర్లు లేకున్నా ఒకే దరఖాస్తులో పేర్లను చేర్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులున్నారు.

కొడంగల్ మున్సిపాలిటీలో..

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 8, 9 వార్డుల్లో గురువారం ప్రజాపాలన నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ఆయా కాలనీల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ 9వ వార్డులో పర్యటించారు. ప్రజాపాలన శిబిరం దగ్గరకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు.

దరఖాస్తులు నింపేందుకు సహకరించండి..


ధారూరు: ధారూరు మండల పరిధిలోని మున్నూరుసోమారం గ్రామ పంచాయతీలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభను జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ పరిశీలించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌ను పరిశీలించి రేషన్ కార్డులు లేనివారు తెల్లకాగితంపై రాసి ఇస్తున్న వారికి ప్రత్యేకంగా రిసిప్టును అందజేసే విధానాన్ని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు చూస్తూ వారి చేతుల్లోని దరఖాస్తుల్లో ఒకదానిని తీసుకుని క్షుణ్ణంగా పరిశీలించి సూచనలు చేశారు. ఎవరైనా నిరక్షరాస్యులంటే వారి దరఖాస్తులను మీరే పూర్తిచేసి వారికి రిసిప్టు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ భువనేశ్వర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, గ్రామ సర్పంచ్ అనూష, ఎంపీటీసీ రవీందర్, తెలంగాణ ఉద్యమకారుడు రాంరెడ్డి, ఎంపీఓ షఫీఉల్లా, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఉన్నారు.

బైక్ చోరీ కేసులో..

నిందితుడికి ఐదు నెలల జైలు

తలకొండపల్లి: బైక్ చోరీ కేసులో నిందితుడికి గురువారం ఆమనగల్లు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి స్వరూప జైలు శిక్ష విధించారు. ఎస్ఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని జూలపల్లికి చెందిన గోపాల్ జూలై-2023లో సొంత పనుల నిమిత్తం బైక్‌పై తలకొండపల్లికి వెళ్లాడు. బైక్‌ను పార్క్‌చేసి సబ్ స్టేషన్ వద్దకు వెళ్లాడు. పని ముగించుకొని వచ్చి చూసేసరికి పార్క్ చేసిన స్థలంలో బైక్ కనిపించలేదు. బైక్ పెట్టిన ప్రదేశంలో లింగరావుపల్లికి చెందిన అంజయ్య అనుమానాస్పదంగా తచ్చాడుతూ కన్పించాడు. గోపాల్ తలకొండపల్లి పీఎస్‌లో అదేరోజు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కోర్టులో సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో సివిల్ కోర్టు జడ్జి స్వరూప.. అంజయ్యకు ఐదు నెలల సాధారణ శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్ఐ తెలిపారు.

ఫార్మాసిటీపై అపోహలొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరెడ్డి

- భూసేకరణ ప్రతిపాదిత గ్రామాల్లో పరిశ్రమలను ఏర్పాటుచేయం
- మెగా టౌన్‌షిప్‌తో ఈ ప్రాంతంలో ఊహించని అభివృద్ధి
- ధరణి పోర్టల్‌లో భూ రికార్డులను నమోదు చేయిస్తాం
- ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

యాచారం: భూసేకరణ చేపట్టిన ప్రతిపాదిత గ్రామాల్లో ఎట్టి పరిస్థితిల్లో ఫార్మాసిటీని పెట్టేది లేదని, ఫార్మాసిటీని మరొకచోటకు తరలించే విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన వైఖరితో ఉన్నారని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి స్పష్టం చేశారు. యాచారంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గతంలో ఫార్మాసిటీ పేరుతో కేసీఆర్ సర్కార్ భూదోపిడీకి పాల్పడి రియల్ వ్యాపారం చేయాలని చూసిందని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసే విషయంలో బీజేపీలో ద్వంద వైఖరి కనిపిస్తోందని అన్నారు. ప్రస్తుతం ఫార్మాసిటీ పేరుతో భూసేకరణ చేసిన గ్రామాల్లో కాలుష్య రహిత పరిశ్రమలతో పాటు మెగా టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటు అవుతుందని రైతులు ఆందోళన, భయపడాల్సిన అవసరమే లేదని అన్నారు.

ధరణి పోర్టల్‌లో నమోదు చేస్తాం..

త్వరలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్‌తో సమావేశమై టీఎస్ఐఐసీ పేరుమీద ఉన్న రైతుల పట్టా భూరికార్డులను ధరణి పోర్టల్‌లో రైతుల పేర్లపై మార్చేస్తామని అన్నారు. భూముల క్రయవిక్రయాలతో పాటు రైతు భరోసా పథకం అందేలా చూస్తామన్నారు. ఆయా గ్రామాల్లో ఇక భూసేకరణ కూడా చేసేదిలేదన్నారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కుర్మిద్ద సర్పంచ్ రాజశేఖర్‌రెడ్డి, నల్లవెల్లి ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్, మాజీ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, నిరంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆడబిడ్డలకు అండగా ఉండాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి



చెక్కులు అంద చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను కొత్త ప్రభుత్వం కూడా అమలు చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరై లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభించారని అన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ఆడబిడ్డల కల్యాణం కోసం లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెబుతున్నారు. త్వరగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్, కమిషనర్ సుమన్ రావు, డిప్యూటీ తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.